ప్రజాశక్తి
గురువారం 11 డిసెంబర్ 2025

రాజీ ప్రయత్నాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామానికి చెందిన దళిత ఆశావర్కర్ పొందూరు విద్యావతి మృతిపై ఆమె బంధువులు దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారి వారితో రాజీ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఫిర్యాదుదారులను సాలూరు పిలిపించి రాజీ కుదిర్చేందుకు ఆ అధికారి ప్రయత్నించడంతో దళిత సంఘాల నాయకులు తిరస్కరించినట్లు సమాచారం. విద్యావతిని వేధింపులకు గురి చేసిన టిడిపి నాయకుడు గౌరునాయుడు, డాక్టర్ హరికృష్ణపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మన్యం వలస పోతోంది

గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నాయని మన పాలకులు ఊకదంపుడు ప్రసంగాలు ఇస్తున్నారు. సంక్షేమ పథకాలు అందించి స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారు. పరిశ్రమలు తెస్తాం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామంటూ కోతలు కోస్తున్నారు. అయితే ఏజెన్సీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కూడా 100 రోజులకే పని పరిమితం కావడంతో ఇక్కడ గిరిజనులు గ్రామాలు వదిలి ఇతర జిల్లాలకు పొట్టకూటి కోసం పరుగులు తీస్తున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలను ఇళ్ల వద్ద వదిలేసి, మిగతావారు గ్రామాలు విడిచి వెళ్లడంతో బాధాకరం.

- వంద రోజులకే పరిమితమైన ఉపాధి
- స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- ఖాళీ అవుతున్న గిరిజన గ్రామాలు

వలస వెళ్లడానికి సిద్ధమైన గిరిజనులు

వలస కూలీల కోసం ఏర్పాటు చేసిన వాహనాలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో సుమారు 50 వేలు జనాభా. 20 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 15,130 కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఇచ్చారు. ఇందులో 14,526 మంది ఉపాధి పనికి వెళ్తున్నారు. వేతనదారులు 29,526 ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మండలంలో ఉపాధి హామీ ద్వారా రూ.69.63 కోట్లతో 9,343 పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు సుమారు రూ.28 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఒక కుటుంబానికి ఒక జాబ్ కార్డు మాత్రమే. జాబ్ కార్డుకు వంద రోజులు పని కల్పించడంతో ఆ కుటుంబంలో నలుగురు ఉంటే ఒక మనిషికి 25 రోజులు పని దినాలు రావడంతో జీవనం కష్టమవుతుంది. ఏజెన్సీలో ఆర్ఒఎఫ్ఆర్ భూములు ఉంటే 150 రోజులు పనులు కల్పిస్తున్నారు. దీంతో గిరిజనులు వలసబాట పడుతున్నారు.

సీతంపేట ఏజెన్సీలో సరైన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. గిరిజనులు పొట్టకూటి కోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు వలస వెళ్లిపోతున్నారు. ఇక్కడ ఉపాధి హామీ చట్టం ఉన్నప్పటికీ 100 రోజులకే పరిమితం కావడంతో మిగతా 9 నెలలు ఎలా బతకాలని గిరిజనుల ప్రశ్న. మండలంలో ఆడలి, బిరింది గూడ, యల్లంగూడ, కిండంగి తదితర గ్రామాల గిరిజనులు ఇటీవల కృష్ణా జిల్లా బయల్దేరారు. ఈ సీజన్లో కోతలు కోయడానికి వెళ్లారు. మరల మార్చిలో మొక్కలు తీయడానికి వెళ్తారు. పూతికవలస గ్రామం నుండి కొంతమంది యువకులు అమలాపురం, అంతర్వేది ప్రాంతాల్లో చేపల చెరువుల్లో పనిచేయడానికి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

గిరిజన రైతులు వ్యవసాయం

అంతంతగా మాత్రమే పొలాలు, కొండపోడు తప్ప ఏమీ లేవు. ఉన్న కొండపోడు వ్యవసాయం కూడా ఒకటో రెండో ఎకరాలు తప్ప అంతకు మించి రైతులు ఉండరు. కొండపోడు ఉత్పత్తిలో ఏదో ఒక నెలలో పంట కాపు వస్తుంది. మిగతా రోజుల్లో ఆదాయాలు ఉండవు. దీంతో బతుకు బండి భారం అవుతుంది. ఇప్పటికే ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో ఏజెన్సీలో ఉన్న వేతనదారులకు 200 రోజులు పని కల్పించాలని ఎన్నోమార్లు ధర్నాలు, అధికారులకు గ్రీవెన్స్‌లో విన్నవించినా ప్రయోజనం కనిపించలేదు. అంతేగాక ఉపాధిలో చేసిన పనులు కూడా సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వలసలకు మరో కారణమని చెప్పొచ్చు.

ఉపాధి పనిదినాలు పెంచాలి

ఉపాధి పనిదినాలు 100 రోజులే. అవి సరిపోవడం లేదు. ఎక్కువ రోజులు పెంచాలి. ఈ సీజన్లో కోతలకు గుడివాడ, బందరు వెళ్తున్నాం. మరల మార్చిలో మొక్కలు తీయడానికి వెళ్తాం. రోజుకు రూ.700 వరకు ఇస్తున్నారు.

-సవర కురమయ్య,
బెన్నడుగూడ గ్రామం

వలసలు నివారించాలి

వలసలు నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ ద్వారా వేతనదారులకు 200 రోజులు పని దినాలు కల్పించాలి. సకాలంలో వేతనాలు ఇవ్వాలి. సౌకర్యాలు కల్పించాలి.

- ఎం.తిరుపతిరావు,
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

జాబ్ కార్డుకు వంద రోజుల పని

ఉపాధి జాబ్ కార్డు ఉన్న వారికి వంద రోజులు పని కల్పిస్తున్నాం. ఆర్ఒఎఫ్ఆర్ భూములు ఉన్నవారు ఆ పట్టాకు జాబ్ కార్డు అనుసంధానమైతే 150 రోజులు పని కల్పిస్తున్నాం. వేతనాలు కూలీలకు సకాలంలో అందిస్తున్నాం.

- ఆర్.సాగర్,
ఎపిఒ, సీతంపేట మండలం

మహాసభలో మాట్లాడుతున్న వెంకటేష్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ పిలుపు

15 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ఎస్ఎఫ్ఐ 33వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ సంఘం జెండాను ఆవిష్కరించారు. భగత్ సింగ్ చిత్రపటానికి వెంకటేష్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఇందు, బి.అనిల్, సురేష్ అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ విద్యా విధానం అతలాకుతలం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా గుర్తింపుగా నిలిచిన ప్రాథమిక పాఠశాలలను అనేక సంస్కరణలు, మార్పులతో నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం అమలు చేసిన 117 జిఒను రద్దు చేస్తామనే హామీని విస్మరించడం చాలా అన్యాయని మండిపడ్డారు. ఉపాధ్యాయులు గతం కంటే నేడు మరో రూపంలో దాడికి గురవుతున్నారని చెప్పారు. సిబ్బంది, తదితరుల వేతనాల పెంపుదలపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం పనిభారాలు పెంచే కుట్రలు చేపడుతుందన్నారు. పని ప్రదేశాలలో రాజకీయ వేధింపులు తాళలేక సిబ్బంది విధుల నుంచి వైదొలగే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. పిటిఎంల సంబరాలు ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం కాకుండా పాఠశాలల సమస్యలు పరిష్కార దిశగా కృషి చేయాలని హితవుపలికారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, చాలీచాలని గదులతో, సొంత భవనాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పాలవుతున్నారని అన్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

తీర్మానాలు ఆమోదం

పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రంలో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు నిర్మించాలని, సంక్షేమ హాస్టళ్లలో రెగ్యులర్ ఎఎన్ఎంలను నియమించాలని, అన్ని గ్రామాలలో బస్సు సౌకర్యాలు కల్పించాలని, తదితర తీర్మానాలను మహాసభలో ఆమోదించారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సింహాచలం, అనిల్

ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా హిమరిక సింహాచలం, కార్యదర్శిగా బిడ్డిక అనిల్, సహాయ కార్యదర్శులుగా టి.అఖిల్, ఎ.గంగారం, ఉపాధ్యక్షులుగా సురేష్ ఎన్నికయ్యారు.

సింహాచలం, అనిల్

ఇన్‌సర్వీస్ టీచర్లకు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నిరసన చేపట్టారు. 2009 విద్యా హక్కు చట్టంలో అవసరమైన సవరణ చేసి 2010 ముందు ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులకు పూర్తిగా టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వంతోనూ రివ్యూ పిటిషన్ వేసే విధంగా ఒత్తిడి చేయాలని కోరారు. పార్లమెంటులో విద్యా హక్కు చట్టం సవరణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారాలు, సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరుకావాలని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా విద్యాశాఖ విధానాలు ఉండాలి అంతేకానీ ఒత్తిడి చేస్తే మంచి ఫలితాలు రావని విద్యాశాఖ అధికారులు గుర్తించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు రాత్రి బస చేయాలని, రాత్రిపూట ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులను ఉపాధ్యాయులు దహనం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు కె.గోవిందమ్మ, ఎం.శంకర్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

డ్రగ్స్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఐద్వా సదస్సులో ఎఎస్‌పి మనీషారెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యతని ఎఎస్‌పి మనీషా రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఐద్వా ఆధ్వర్యంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి.ఇందిర అధ్యక్షతన 'మాదక ద్రవ్యాల నియంత్రణ -సమాజం బాధ్యత' అనే అంశంపై సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.శ్రీలక్ష్మి మాట్లాడారు. ఇటీవల సమాజంపై మాదకద్రవ్యాల ప్రభావం అధికమైందని, ఇది జనజీవనానికి, ప్రశాంతతకు, యువత భవిష్యత్తు అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. గంజాయి, కొకైన్‌తోపాటు ఖైని, గుట్కా వంటి హానికరమైన నిషేధిత వస్తువుల వినియోగం పెరగడం సమాజంపై తీవ్ర హానికరమైన ప్రభావం పడుతుందని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు నియంత్రణ పాటించడంతోపాటు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు సహకారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా ప్రభావం యువతపై అధికంగా ఉందని తెలిపారు. వీటి దుష్ప్రభావాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండి ఉన్నతమైన భవిష్యత్తు కోసం సామాజిక స్పృహతో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం కూడా మాదకకద్రవ్యాల నియంత్రణకు చిత్త శుద్ధితో కృషి చేయాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకులు పి.శాంతకుమారి, కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి మనీషారెడ్డి

బహుళ పంటలతో నిరంతర ఆదాయం

కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రకృతి వ్యవసాయ విధానాలు, బహుళ పంటల సాగు ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శనలో భాగంగా బుధవారం బందలుప్పి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని కర్రి మురళి అనే రైతు పొలాన్ని సందర్శించారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ రకాల పంటల ఎటిఎం, ఎ గ్రేడ్ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇటువంటి నమూనాలను అనుసరించి, బహుళ పంటల విధానం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. 365 రోజులూ పొలం మొత్తం పలు పంటలతో కప్పి ఉంచాలన్నారు. దీని వల్ల సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది భూసారం పెరుగుతుందని చెప్పారు. భూమిలో సేంద్రీయ కర్బనం శాతం పెరగడం వల్ల పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులకు తెలియజేశారు. ప్రధాన పంటతోపాటు అంతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రెడ్డి అన్నపూర్ణ, జిల్లా ఉద్యాన అధికారి సత్యనారాయణ రెడ్డి, ఎడిఎ వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి అశోక్, డిపిఎం ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు, డిపిఎంయు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి

కనీస వేతనాలు చెల్లించాలని

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ఫీల్డ్‌అసిస్టెంట్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం, కనీస వేతనం చెల్లించకపోవడం దారుణమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. పని దినాలు సాకుగా చూపించి జీతాలు తగ్గించడం మానుకోవాలన్నారు. రికార్డులు, స్టేషనరీ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రికవరీల పేరుతో వేధింపులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. అనంతరం ఎంపిడిఒ జయలక్ష్మికి వినతి అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు జె.చంద్రశేఖర్, పి.శ్రీనివాసరావు, టి.మోహన్ దాస్, ఎ.శంకరరావు, వి.రమణమ్మ, ఎన్.సత్యవతి, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల ధర్నా

కొమరాడ.. నిరసన వద్ద ఎపిఒకు వినతి అందిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు

బలిజిపేట : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని ఎపి ఫీల్డ్‌అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శ్రీను, దాలమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నారాయణరావు, శేఖర్, నాగభూషణ, దీవెన, శంకర్రావు, గోపి, ఎల్లమ్మ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎపిఒ భానుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు రూ.5740 ఇస్తున్నారని, ఇది ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాలూరు : ఉపాధి హామీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతికి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మర్రి శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాద్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-సీతానగరం

ధాన్యం మద్దతు ధరను అమలు చేయాలని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో దళారుల జోక్యం అధికమైందని, మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ధాన్యం బాగోలేదని మిల్లర్లు ప్రచారం చేస్తూ, అదనంగా తూనిక వేయిస్తున్నారని చెప్పారు. ధాన్యం తూనికలో మోసాలను అరికట్టాలంటే ప్రతి రైస్‌మిల్లు వద్ద జిల్లా, మండలాధికారులు పర్యవేక్షణ ఉండాలని డిమాండ్‌చేశారు. లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని, చెరకు రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి, చెందుతుందని, దీనికి బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, ఆర్.రమణమూర్తి, ఆర్.రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలస చెరువు గట్టు వద్ద బుధవారం బైక్‌ను బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సాలూరు మండలం మావుడి కొత్తవలసకు చెందిన చౌడిపల్లి గణేష్, సాయి, ముసురు మామిడిపల్లి పిహెచ్‌సికి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. గణేష్ కాలు విరిగిపోగా, సాయి, ముసురుకు తీవ్ర గాయాలయ్యాయి. సాయి 9 నెలల గర్భిణీ. క్షతగాత్రులను విజయనగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గిరిజన గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు మండలంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా సర్వే చేయని నాలుగు గిరిజన గ్రామాల ప్రచురణ ప్రక్రియలో భాగంగా, ఆమె ఆయా గ్రామాలను సందర్శించారు. నంద అటవీ బ్లాక్‌లో ఉన్న కుడకూరు, మడకారు, శిఖపరువు, కొనదార గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా, సబ్ కలెక్టర్ కుడకూరు మడకారు గ్రామాలను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించిన అనంతరం సర్వే శాఖ ఎడి, సాలూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.తవిటినాయుడు, తహశీల్దార్ నీలకంఠారావుకు దిశా నిర్దేశం చేశారు. మిగిలిన శిఖపరువు, కొనదార గ్రామాల్లో కూడా వెంటనే సర్వే పూర్తి చేయాలనీ అధికార బృందాన్ని ఆమె ఆదేశించారు.

అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే జగదీశ్వరి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రహదారులు, గృహాలు, పింఛన్లు, మంచినీటి సరఫరా వంటి పలు సమస్యలపై ఎమ్మెల్యేకి వినతులు అందించారు. సంబంధిత శాఖాధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండడం, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడం లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

శిఖవరంలో 'మా ఊరికి మలేరియా వచ్చింది'

ప్రజాశక్తి-కొమరాడ

కెమిశీల పంచాయతీలో గిరిజన గ్రామమైన శిఖవరంలో 'మా ఊరికి మలేరియా వచ్చింది' కార్యక్రమాన్ని మండల అధికారులు బుధవారం చేపట్టారు. ఆ గ్రామానికి అధికారులు వెళ్లి మలేరియా బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ గ్రామంలో కడ్రక అమ్మడమ్మకి మలిరియా సోకినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనారోగ్యం లక్షణాలున్న ప్రతిఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామమంతా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అంగన్వాడీ, పాఠశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తాగునీటి బోర్లు, బావుల నుంచి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తనూజ, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి-సీతంపేట

పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్

సీతంపేట ఏరియా ఆస్పత్రి, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ అన్నారు. బుధవారం సీతంపేట ఏరియా ఆస్పతి, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపించకూడదని అన్నారు. ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భువనేశ్వరి చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థిని గేదెల భువనేశ్వరి విదేశాల్లో ఉన్నత చదువులకు ప్రభుత్వం అండగా ఉంటూ ప్రోత్సాహం అందిస్తుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి భరోసా ఇచ్చారు. భువనేశ్వరి ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీలో చదువుకు ఆర్థిక సాయం అందించండి.. అంటూ పత్రికల్లో వచ్చిన వార్తలకు మంత్రి స్పందించారు. ఈ మేరకు విద్యార్థిని భువనేశ్వరి.. బుధవారం సాలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కూడా కలిసేందుకు భువనేశ్వరి తల్లిదండ్రులతో కలిసి వెళ్లనున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు.

సమయపాలన పాటించరేం?

ప్రజాశక్తి-వీరఘట్టం

సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు సచివాలయ సిబ్బందికి పదేపదే జారీ చేస్తున్న ఆదేశాలను అక్కడి ఉద్యోగులు పక్కన పెడుతున్నారు. మండలంలోని తలవరం గ్రామ సచివాలయమే దీనికి నిదర్శనం. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయం తెరచి ఉంచాలనే నిబంధన ఉంది. బుధవారం సచివాలయ సిబ్బంది సాయంత్రం నాలుగు గంటలు దాటిన వెంటనే తలుపులు వేసి ఇంటి ముఖం పట్టారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే ఐదు గంటల వరకు ఉండి విధులు నిర్వహించారు. సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సమయపాలన పాటించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థినులను ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర బుధవారం ఘనంగా సత్కరించారు. పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన బి.వినీత జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. జి.లాస్య ప్రియ కాంస్య పతకాన్ని సాధించింది. వారిద్దరూ బుధవారం ఎమ్మెల్యే విజయ్‌చంద్రని కలిశారు. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటి మన్యం జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఉమామహేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

సమరయోధుల త్యాగాలు స్మరించుకోవాలి

ప్రజాశక్తి-మక్కువ

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటితరం నిరంతరం స్మరించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజులలీల అన్నారు. బుధవారం కాశీపట్నం పంచాయతీలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లకు జాతీయ జెండా, వందేమాతరం విశిష్టత గురించి ఆమె వివరించారు. ఎన్ఎస్ఎస్ శిబిరం మూడో రోజు వాలంటీర్లు పలు కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల విద్యార్థులు ప్రజలతో కలిసి గ్రామంలో జాతీయ జెండా చేపట్టి ర్యాలీ నిర్వహించారు.

పేదరికం లేని సమాజానికి కృషి

ప్రజాశక్తి-కొమరాడ

ప్రతి గ్రామంలోనూ పేదరికం లేని సమాజం కోసం మహిళా సంఘాల సభ్యులు పూర్తిస్థాయిలో కృషిచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టిఐటి, ఐబి డిపిఎం డాక్టర్ సిహెచ్.రామ్మోహన్ రావు అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో రెండో రోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు తమ కుటుంబాలు ఏవిధంగా బలోపేతం చేసుకొని అభివృద్ధి చెందాలో వివరించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డిపిఎం ధర్మారావు, ఎపిఎం సురేష్, టిఐటి వెంకటరమణ, సిసిలు నాయక్, రమేష్, ఈశ్వరమ్మ, శారద, రామకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల సేవాభావం అభినందనీయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ చేయడం అభినందనీయమని తహశీల్దార్ నిమ్మక శేఖర్ అన్నారు. మండలంలోని జెకెపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ పిఒ రామయ్య, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్ ఉన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా మోహన్‌బాబు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట డిప్యూటీ ఎంపిడిఒగా కె.మోహన్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వంద శాతం ప్రజలకు సేవలు అందించేటట్టు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని కోరారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కొత్తకోట జంక్షన్ వద్ద ఎస్ఐ షేక్ మస్తాన్ బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లరాదని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసులున్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట నేలమట్టం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కర్రిగూడకొండ ప్రాంతంలో సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో 1400 లీటర్ల బెల్లం ఊటను నేలమట్టం చేశారు. డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా విక్రయించినా, తయారుచేసినా కేసులు తప్పవని హెచ్చరించారు. సారా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

ప్రభుత్వ వైద్యం పేదల హక్కు

మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ వైద్యం పేదల హక్కని, అలాంటి పేదలకు వైద్యాన్ని దూరం చేయడమే లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపిని తెరపైకి తెచ్చిందని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి ధ్వజమెత్తారు. బుధవారం కురుపాంలో కోటి సంతకాల సేకరణ పత్రాలను తరలించేందుకు సిద్ధం చేసిన వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైద్య రంగాన్ని ప్రయివేటుపరం చేసే ప్రమాదకర విధానమైన పిపిపి మోడల్‌ను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైద్యాన్ని పూర్తిగా దూరం చేసి, కోట్లాది పేదల ఆరోగ్య భద్రతను ప్రమాదంలోకి నెట్టే విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ఈ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, కోటి సంతకాల ఉద్యమానికి ప్రజల మద్దతు విశేషంగా లభించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, ఎంపిపిలు శెట్టి పద్మావతి, శెట్టి శ్యామల, కె.దీనమయ్య, జెడ్‌పిటిసిలు జి.సుజాత, ఎం.శశికళ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : సాలూరు పట్టణంలో బుధవారం మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆధ్వర్యాన భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం బోసుబొమ్మ కూడలిలో సుభాష్ చంద్రబోస్, వైఎస్ఆర్ విగ్రహాలకు రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలో సేకరించిన కోటి సంతకాల పత్రాలను తరలించే ప్రత్యేక వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పార్వతీపురం పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి వైసిపి శ్రేణులు భారీ బైక్ ర్యాలీ చేపట్టాయి. వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన సంతకాలతో నాయకులు ర్యాలీగా ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకొని, అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ

కురుపాం.. కోటి సంతకాలు సేకరణ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న పుష్పశ్రీవాణి, సాలూరులో ర్యాలీ చేపడుతున్న రాజన్నదొర, నాయకులు

పార్వతీపురంలో బైక్ ర్యాలీ చేపడుతున్న అలజంగి జోగారావు, నాయకులు, కార్యకర్తలు

నియోజకవర్గంలో 64 వేలకు పైగా సంతకాలు సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష, జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాద్, ఎంపిపిలు మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసిలు మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు వెలితి సాయిరాం, సిద్ధ జగన్నాథం, బంకురి రవికుమార్ పాల్గొన్నారు.

సమానత్వానికి పునాది మానవ హక్కులే

ప్రజాశక్తి-కురుపాం

ప్రతి వ్యక్తి గౌరవప్రదమైన, వివక్షత లేని జీవితం గడపడానికి మానవ హక్కులు ప్రాథమిక హక్కులని కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయను మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామ్మోహన్ రావు, రమేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం.. విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు కోర్టు సిబ్బంది

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని బుధవారం కురుపాం కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ప్యానల్ అడ్వకేటు బరాటం చంద్రమౌళి మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులతో కురుపాం కోర్టు నుండి బస్టాండ్ వరకూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వామి, పారాలీగల్ వాలంటీరు అంధవరపు కోటేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తోట శంకర్రావు, ఉపాధ్యాయులైన కె.అరుణజ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ పి.హకృష్ణ, మండల లీగల్ సర్వీసెస్ ఉద్యోగి పాలకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బలగ శాంతకుమారి మాట్లాడుతూ మానవ హక్కుల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.రోజా, కొత్తాడ శంకరరావు, ఎన్.సత్యనారాయణ, బంకురు తిరుపతిరావు, ఎం.రమేష్, వైకుంఠరావు, ఎన్‌సిసి కెప్టెన్ గుప్తా పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుశాంత్ జనా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎలాంటి వివక్షత లేకుండా, ఇతరులతో గౌరవంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.ప్రభాకరరావు, అధ్యాపకులు ఎస్.రవికుమార్, యు.ఫణికుమారి, టి.లలితకుమారి, ఎస్.విజయలక్ష్మి, ఎం.శంకర్ రావు, బి.నరేష్, ఎస్.తమ్మయ్య, ఎ. వర్గీస్ పాల్గొన్నారు.

రామకృష్ణకు సేవా పురస్కారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో 15 ఏళ్లుగా గిరిజనులకు నిస్వార్థంగా సేవలందిస్తున్న ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావుకు భారత హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సేవా పురస్కారాన్ని అందజేసింది. స్థానిక కల్యాణ మండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సేవా పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం అందించారు. ఆయనకు పురస్కారం రావడం పట్ల గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

జీతాలు, డైట్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు, సిబ్బంది జీతాలు, వసతి గృహాలకు డైట్ బిల్లులు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వసతిగృహాలకు రెండు నెలల వరకు డైట్ బిల్లులు లేవని, దీనివల్ల వార్డెన్లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు దినదిన గండంగా జీవితం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను హరించే విధంగా నూతనంగా లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మిక వర్గంపై తీవ్ర భారం మోపారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పరచడం ద్వారా సామాన్యులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కూడా లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అన్నారు. అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభ విశాఖపట్నంలో మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి కార్మికులు, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.కుమారి, జయ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు చంద్రశేఖర్, శంకర్రావు, మోహన్‌దాస్, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు కళావతి పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం టిడిపి గరుగుబిల్లి మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, పార్టీ బలోపేతం ప్రతి కార్యకర్త బాధ్యతని స్పష్టంచేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

పార్టీ అభివృద్ధి, ప్రజా పరిచయం, గ్రామ స్థాయి ఎన్నికల వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఆమె దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మరడాన నారాయణ స్వామి నాయుడు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును పెంచాలి

ప్రజాశక్తి-పాచిపెంట

మాట్లాడుతున్న ఎంఎంసి చైర్మన్ సూర్యనారాయణ

చిరుధాన్యాల సాగుకు గిరిజన రైతులే బ్రాండ్ అంబాసిడర్లని, ఆ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ కోరారు. శతాభిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల సాగు రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కజొన్న, పత్తి వంటి పంటలను పండిస్తూ క్రిమిసంహారక, కలుపు నివారణ మందులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా తేనెటీగలు చనిపోతున్నాయని తెలిపారు. అందుకే గిరిజన గ్రామాలలో తేనె పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రకృతితో మమేకమై జీవనాన్ని కొనసాగించే గిరిజనులు ఎట్టి పరిస్థితులలో కూడా రసాయనాలు వాడకూడదని సూచించారు. ప్రభుత్వం చిరుధాన్యాలకు మద్దతుధర కల్పిస్తుందని, సాగు విస్తీర్ణాన్ని పెంచాలని, అందుకు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామయ్య, వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, మాజీ సర్పంచి లచ్చయ్య, పీసా సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసి చైర్మన్ శ్రీరామ్, విఎఎలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, భవిష్యత్తు మన చేతుల్లోనే

ఎమ్మెల్యే జయకృష్ణ

సైకిల్ యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆరోగ్యం, భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంటాయని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో డ్రగ్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు మెదడు శక్తిని తినేస్తుందన్నారు. ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గ్రామాల్లో డ్రగ్స్ విక్రయాలు చేపడితే 1972కు కాల్ చేయాలని కోరారు. అనంతరం పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, ఎ.కృష్ణ, తూముల రమేష్, జంపు చంద్రశేఖర్, ఎస్.అచ్యుతరావు, జనసేన జానీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - కురుపాం

బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సిడిపిఒ జి.రజినిదుర్గ కోరారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలోని భూమికి జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలు, నిరోధించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో బాల్యవివాహాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూపర్‌వైజర్ జి.శ్రావణి, మహిళా పోలీస్ వెంకటరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహ ముక్త్ భారత్ 100 రోజుల స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా గుమ్మలక్ష్మీపురం వెలుగు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రగిరి సిడిపిఒ విజయగౌరీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐవి లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు ఎంఎ నాయుడు, తిరుపతి నాయుడు, సోషల్ వర్కర్ రమ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు ఉషారాణి, గౌరమ్మ, ఒఎస్‌సి కౌన్సిలర్ ప్రవళిక , ఎపిఎం సతీష్, సిసిలు, విఒఎలు ఉన్నారు.

పోలీసుస్టేషన్ సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి

స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎఎస్‌పి మనీషా రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్‌లో అన్ని రికార్డులను పరిశీలించారు. నేర విభాగ విభాగాలను ఛేదించడంలో నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐ పి.రంగనాథం, ఎస్ఐ ఎం.రాజేష్, ఎఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపకందారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సాలూరు

గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిఎంపిఎస్ నాయకులు ఫారెస్ట్ రేంజర్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రండి అచ్యుతరావు మాట్లాడుతూ జిఒ 559, 1016లను అమలు చేసి, పశువులను నిలుపుకోవడానికి స్థలాలు, కొండలలో మేపుకొనుటకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెద్దగడ్డ జలాశయం గట్టుమీద నిలుపుకున్న పశువులను కూడా ఫారెస్ట్ అధికారులు ఆటంకాలు పెడుతున్నారని చెప్పారు. ఇటీవల బోర పాపయ్యపై ఒక ఫారెస్ట్ అధికారి వయసు కూడా చూడకుండా దాడి చేశారని తెలిపారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మర్రి శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, జిఎంపిఎస్ నాయకులు తాడేల వెంకటరమణ, బిసికి చెన్నారావు, ఎర్ర రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన, పరిశుభ్రతతో ఆరోగ్యం భద్రం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఆరోగ్య అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం పిఒ డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. బెలగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బ్రాంచ్ స్కూల్)ను బుధవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. తొలుత ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్య వివరాలు, వైద్య సిబ్బంది చేపడుతున్న హెల్త్ స్క్రీనింగ్‌పై తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారం హెల్త్ కార్డులో పొందుపర్చాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. అనంతరం వ్యాధులు, ఆరోగ్య అంశాలపై విద్యార్థులకు ఐఇసి ద్వారా అవగాహన కల్పించారు. ముందుగా వీటిపై వారికి గల పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో హడ్డుబంగి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు మూడు రోజుల పాటు రోబోటిక్స్ స్కిల్‌పై వర్క్‌షాప్‌ను ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ స్కిల్ డెవలప్మెంట్‌పైన ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు వితరణ

ప్రజాశక్తి-బలిజిపేట

కిట్లు అందజేస్తున్న సర్పంచ్ రాఘులత

బలిజిపేట సచివాలయ పరిధిలోని లెప్రా సొసైటీ సహకారంతో హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో ఫైలేరియా బాధితులకు చెప్పులు, స్వయం సంరక్షణ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. 71 మంది బాధితులకు సర్పంచ్ బండారు రాఘులత వీటిని అందజేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, పిహెచ్‌సి వైద్యులు మాధురి, లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ లెంక రమణ, గ్రామపెద్దలు బోగా రామారావు, పంచాయతీ కార్యదర్శి జామి శేఖర్, లెప్రా ఫిజియోథెరపిస్ట్ లావణ్య, ఎంపిహెచ్ఎ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.